పాదచారికి.. దారేదీ..?

- సైనిక్‌పురిలో ఫుట్‌పాత్ కబ్జా
- షెడ్ వేసి యథేచ్ఛగా వ్యాపారం
- పట్టించుకోని జీహెచ్‌ఎంసీ సిబ్బంది
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు




సైనిక్‌పురిలోని ప్రధాన చౌరస్తాలో ఆక్రమణకు గురైన ఫుట్‌పాత్

కాప్రా: పాదచారుల భద్రత కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు కాప్రా సర్కిల్‌లో ఆక్రమణలకు గురయ్యాయి. ఏకంగా సైనిక్‌పురి ప్రధాన చౌరస్తా, నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి కూతవేటు దూరంలో, కాప్రా డివిజన్ వార్డు కార్యాలయం ముందే దర్జాగా ఫుట్‌పాత్, రోడ్డును ఆక్రమించి షెడ్ ఏర్పాటు చేశారంటే ఆక్రమణలు ఎంత యథేచ్ఛగా కొనసాగుతున్నాయో అర్థమవుతోంది.

ఫుట్‌పాత్ ఆక్రమించి వ్యాపార కేంద్రం..

సైనిక్‌పురి చౌరస్తాలోని షాపింగ్ కాంప్లెక్స్ ముందు ఏకంగా ఫుట్‌పాత్‌ను ఆక్రమించి కొందరు వ్యక్తులు షెడ్ నిర్మించి వ్యాపార కేంద్రంగా మార్చారు. అసలే చౌరస్తాలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతుంటే దానికి తోడు రోడుపై వరకు ఆక్రమించి షెడ్ నిర్మించి ఫుడ్‌కోర్టును ఏర్పాటు చేశారు. ప్రధాన చౌరస్తాలో ఇంత జరుగుతున్నా జీహెచ్‌ఎంసీ అధికారులు ఎందుకు అటువైపు కన్నెత్తి చూడటం లేదని జనం ప్రశ్నిస్తున్నారు. ఈ ఫుట్‌పాత్ స్థలంపై వ్యక్తులు ఎప్పుడో కన్నేసినట్టున్నారు. ముందుగా ఈ స్థలాన్ని చదును చేసి కొన్ని రోజులు ఎదురు చూశారు. తర్వాత చిన్నగా కర్రలతో చిన్నచిన్న వాల్స్ ఏర్పాటు చేశారు. అనంతరం ఏకంగా పూర్తి స్థాయిలో షెడ్ ఏర్పాటు చేసి అందులో వ్యాపార కేంద్రం ఏర్పాటు చేశారు.

అదును చూసి షెడ్ నిర్మించి..

టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్ ప్రసాద్ హయాంలో ఈ స్థలం చదును చేస్తున్నారని తెలియడంతో మున్సిపల్ సిబ్బందితో విచారణ చేయిస్తామని తెలిపారు. అనంతరం బదిలీల్లో భాగంగా అధికారులకు స్థానచలనం కావడం, నూతన సిబ్బంది, అధికారులు రావడం, అంతలోనే ఎన్నికల విధులు, నూతన ప్రభుత్వంలో వివిధ పనుల్లో తలమునకలవడంతో అన్నీ వెంటవెంటనే జరిగిపోయాయి. ఈ అవకాశాన్ని కబ్జాదారులు అదును చూసి షెడ్ నిర్మించి వ్యాపారం మొదలు పెట్టేశారు. మరి ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అసలు అక్కడ ఫుట్‌పాత్ లేకుండా చేస్తే.. అటు పోలీసులు కానీ, ఇటు జీహెచ్‌ఎంసీ అధికారులు కానీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని జనం ప్రశ్నిస్తున్నారు.

నడిచేందుకు దారిలేదు..

సైనిక్‌పురి చౌరస్తాలో ఫుట్‌పాత్ ఆక్రమణతో పాదచారులు నడిచేందుకు స్థలం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫుట్‌పాత్ ఆక్రమణకు గురికావడంతో రోడ్డుపై నడిచి వెళ్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంతో వెళ్తున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు ఫుట్‌పాత్ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు, పాదచారులు, వాహనదారులు కోరుతున్నారు.

నేటినుంచి ఉప్పల్ మినీ శిల్పారామంలో సంక్రాంతి సంబురాలు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో శనివారం నుంచి 17 వరకు సంక్రాంతి సంబురాలు జరుపుకోనున్నట్లు అధికారులు తెలిపారు. పల్లె వాతావరణం ఉట్టిపడే విధంగా గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసులు, బుడబుక్కల, జంగమదేవరులు, జానపద కళాకారులు సందడి చేయనున్నారు. పట్నం వాసులకు పల్లె అందాలను శిల్పారామంలో చూపించనున్నట్లు తెలిపారు. ఐదు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. భోగి పండుగ రోజు చిన్నారులకు సాయంత్రం భోగి పళ్ల ఉత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు తమ పిల్లలను శిల్పారామానికి తీసుకువచ్చి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

వయో వృద్ధులకు ఉచిత వైద్య సేవలు



మల్లాపూర్: వయో వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని అన్నపూర్ణ కాలనీ ప్రధాన కార్యదర్శి కటార్ల శేఖర్‌బాబు అన్నారు. అన్నపూర్ణ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం వయోవృద్ధులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అవసరమైనవారికి మందులను అందజేశారు. డాక్టర్ దిలీప్, కో ఆర్డినేటర్ శివ, నర్సులు సరిత, శాంతి, కాలనీవాసులు పీఎస్ఎస్ చౌదరి, భాను చందర్‌రెడ్డి, మోబీన్, మల్లారెడ్డి, అంజానేయప్రసాద్, రాజమల్లు యాదవ్, పోశెట్టి, నర్సింహాగౌడ్ తదితరులు ఉన్నారు.

ఉప్పల్ డిపో టీచర్స్ వెల్ఫేర్ కార్యవర్గం



మాట్లాడుతున్న ఎలక్షన్ కమిటీ కన్వీనర్ వి.రాజారాములు

మేడిపల్లి: ఉప్పల్ డిపో టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికలు శుక్రవారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విజయరత్న హైస్కూల్ వేదికగా నిర్వహించారు. ఓటింగ్‌లో ఉపాధ్యాయులంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. అధ్యక్షులుగా వి.శ్రీనివాస్‌రెడ్డి, చందులాల్ గెలిచారు. ప్రధాన కార్యదర్శులు ఆకుల వనజ, పి.రాజశేఖర్, ట్రెజరర్స్ యం.సదానందం, జే.ప్రభాకర్, ఐదుగురు వైస్‌ప్రెసిడెంట్లు, ఐదుగురు కార్యదర్శులుగా నూతన కార్యవర్గం కొలువుదీరింది.

చెత్తరహిత మున్సిపాలిటీ దిశగా అడుగులేద్దాం



మాట్లాడుతున్న మేయర్ జక్క వెంకట్‌రెడ్డి

మేడిపల్లి: చెత్తరహిత మున్సిపాలిటీ దిశగా అడుగులేద్దామని మేయర్ జక్క వెంకట్‌రెడ్డి అన్నారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో తడి, పొడి, హానికరమైన చెత్తను వేరుచేసి తీసుకోవడంలో కలుగుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ నమ్యానాయక్ మాట్లాడుతూ.. రోడ్లపై చెత్త వేయకుండా సూచిక బోర్డులతో, అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బుచ్చిరాజు, మధుసూదన్‌రెడ్డి, ఏంపల్లి అనంతరెడ్డి, దొంతిరి హరిశంకర్‌రెడ్డి, ఐటీసీ ప్రతినిధులు, వార్డు ఆఫీసర్లు, స్వచ్ఛ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి



అల్వాల్: అల్వాల్ కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం విద్యుత్ శాఖ ఏఈ భరత్, అధికారులతో కలిసి లోతుకుంటలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీలో విద్యుత్ సమస్యలు ఉన్నాయని, ఇళ్లపై నుంచి వెళ్తున్న వైర్లు, స్తంభాల మార్పిడి, విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆమె విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. లైన్‌మెన్ భిక్షపతి, హరీష్‌గౌడ్, శేఖర్‌గౌడ్, నరేష్, నవీన్, మల్లేష్‌గౌడ్, సంజీవ్‌రెడ్డి, సందీప్, ప్రేమ్, ప్రశాంత్, అనిత, యాదగిరి, అరుణ్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నాలాను ఆక్రమిస్తే చర్యలు తప్పవు



కుషాయిగూడ: నాలాను ఆక్రమిస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. సాయికృష్ణ ఎన్‌క్లేవ్ పక్కనే ఉన్న విరాట్‌నగర్ కాలనీలో వ్యర్థాలతో నాలాను నింపి గోడ నిర్మాణం చేసి నాలాను ఆక్రమిస్తున్నారంటూ అందిన ఫిర్యాదుపై ఆమె శుక్రవారం నాలాను సందర్శించారు. నాలాను ఆక్రమించి నిర్మించిన కట్టడాన్ని తొలగించాలని అధికారులను ఆదేశించారు. వాటర్‌వర్క్స్ ఏఈ రోహిత్, స్థానికులు కుమారస్వామి, తిరుమలరెడ్డి, రామచంద్రారెడ్డి, శ్రీనివాస్, రమేష్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కూడార్రై ఉత్సవం



మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీ వెంకటేశ్వర దేవస్థానంలో ధనుర్మాస పూజల్లో భాగంగా శుక్రవారం సుమారు 116 గిన్నెల్లో నైవేద్యాన్ని స్వామికి సమర్పించి కూడార్రై ఉత్సవాన్ని నిర్వహించారు. శనివారం శ్రవణానక్షత్రం సందర్భంగా మూలవిరాట్‌కు చందనసేవ జరుగుతుందని ప్రధాన అర్చకులు ముదుంబై వేంకటరమణాచార్యులు, అర్చకులు తులసి రమణాచార్యులు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పలువురికి జైలు

మల్కాజిగిరి: మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన వాహనదారులకు జైలుశిక్ష, జరిమానా విధించారని ఇన్‌స్పెక్టర్ శివశంకర్ తెలిపారు. ముగ్గురికి ఐదు రోజులు జైలుశిక్ష, ఒకరికి రెండు రోజులు జైలు, మరో 25 మందికి జరిమానా విధిస్తూ ఐదో ప్రత్యేక కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి



ఉప్పల్: చిలుకానగర్‌లో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

స్వామి వివేకానంద జయంతిని అన్ని ప్రాంతాల్లో ఘనంగా జరుపుకున్నారు. అన్ని ప్రాంతాల్లో స్వామి వివేకానంద విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు.

– ఉప్పల్ జోన్ బృందం



కాప్రా: డివిజన్ గాంధీనగర్ కమ్యూనిటీ హాల్‌లో స్వామి వివేకానంద జయంతి



కుషాయిగూడ: హెచ్‌బీకాలనీలో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్



గౌతంనగర్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ సునీత



అల్వాల్: ప్రభుత్వ బాలుర పాఠశాలలో వివేకానంద జయంతి

క్రీడలు ఎన్నో విషయాలు నేర్పిస్తాయి

మధ్యప్రదేశ్ విశ్రాంత డీజీపీ మరియాకుమార్



విశ్రాంత డీజీపీ మరియాకుమార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న స్కూల్ ప్రిన్సిపల్ జోసెఫ్ తదితరులు

ఉప్పల్: ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో స్పోర్ట్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మధ్యప్రదేశ్ విశ్రాంత డీజీపీ బి.మరియాకుమార్ హాజరై వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులు క్రీడా జ్యోతితో గ్రౌండ్ చుట్టూ తిరిగారు. విద్యార్థులు కరాటే తదితర విన్యాసాలు చేసి ఆకట్టుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మరియాకుమార్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థిదశను మలుపు తిప్పుతాయన్నారు. అన్నిరకాల ఆటుపోట్లను ఎదుర్కోవడం, తోటి విద్యార్థులతో ఎలా ఉండాలో క్రీడలు నేర్పుతాయన్నారు. పలు పోటీలు నిర్వహించి అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో గౌరవ అతిథులుగా సీనియర్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ జనరల్ పి.వెంకట సుబ్రహ్మణ్యం, జి.ప్రవీణ్ కుమార్, డాక్టర్ అశీష్, రెవరెండ్ బ్రదర్ అరుణ్‌ప్రకాశ్, ప్రిన్సిపల్ జోసెఫ్, బ్రదర్ ఎంఎ జార్జ్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల మన్ననలు పొందాలి

గౌతంనగర్: వినియోగదారుల మన్ననలు పొందుతూ వ్యాపారంలో రాణించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గౌతంనగర్ డివిజన్ పరిధిలోని హనుమాన్‌పేట్ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కృప బైక్స్ ఎంటర్‌ప్రైజెస్ షోరూమ్‌ను శుక్రవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాముయాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మరోసారి మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్‌దే..



నాచారంలో మాట్లాడుతున్న మందముల పరమేశ్వర్‌రెడ్డి

మందముల పరమేశ్వర్‌రెడ్డి

మల్లాపూర్: మల్కాజిగిరి పార్లమెంట్ గడ్డపై మరోసారి కాంగ్రెస్ జెండాను ఎగురవేద్దామని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. నాచారంలో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల సన్నాహక సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా మందముల పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉప్పల్ నియోజకవర్గానికి సీఎం రేవంత్‌రెడ్డి రూ.10 కోట్ల నిధులను కేటాయించినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, కాంగ్రెస్ నేతలు ప్రకాష్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ కృష్ణారెడ్డి, చెన్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, రమేష్‌గౌడ్, రాంరెడ్డి, కృష్ణాయాదవ్, బండారం శ్రీకాంత్‌గౌడ్, రాజు, మహేష్ యాదవ్, రఘు, హెచ్‌ఆర్.మోహన్, వివి.రాజు, మణికంఠ, నరేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



అల్వాల్‌లో బీఆర్ఎస్ నాయకులు

పీజేఆర్‌కు నివాళి

అల్వాల్: దివంగత ఖైరతాబాద్ ఎమ్మెల్యే పి.జనార్దన్‌రెడ్డి జయంతి సందర్భంగా అల్వాల్‌లో ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నందికంటి శ్రీధర్ హాజరై పీజేఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

వెంకటాపురంలో..

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వెంకటాపురంలో పీజేఆర్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు నిమ్మ అశోక్‌రెడ్డి, చంద్రశేఖర్, అఫ్సర్, సురేందర్‌రెడ్డి, శివ, రాజసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వెంకటాపురంలో కాంగ్రెస్ నేతలు

త్వరలో సమస్యలకు పరిష్కారం



ఎస్పీనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్‌లోని సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్‌తో కలిసి శుక్రవారం ఎస్పీనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. చిన్నారులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. విష్ణుపురికాలనీలో అసంపూర్తిగా ఉన్న నాలాపై కప్పు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఆర్‌కేనగర్‌లో పర్యటించి కాలనీ సంక్షేమ సంఘం నాయకులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఇండోర్ స్టేడియంలో సీనియర్ సిటిజన్స్ లైబ్రరీ హాల్‌ను ప్రారంభించారు. మూర్తి, రవికిరణ్, సోమశేఖర్, నర్సింగరావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సంక్రాంతి శోభ.. రంగోళి భళా..

అన్ని ప్రాంతాలు సంక్రాంతి శోభను సంతరించుకున్నాయి. పండగ జరుపుకునేందుకు ఇప్పటికే సొంత ప్రాంతాలకు వెళ్లారు. శుక్రవారం అన్ని ప్రాంతాల్లోని స్కూళ్లలో సంక్రాంతి సంబురాలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



బోడుప్పల్: బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో..



రామంతాపూర్: అరోరా పీజీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు



బోడుప్పల్: లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో వేడుకల్లో చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి



పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గ్లోబల్ ఇండియన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో..



మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో బహుమతులతో..



కాప్రా: విజయ స్కూల్‌లో సంక్రాంతి సంబరాల్లో బీజేపీ నాయకురాలు కొల్లి మాధవి



పర్వతాపూర్ అరోరాలో సంక్రాంతి సంబురాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు



ఓల్డ్ సఫిల్‌గూడలోని కృష్ణవేణి ట్యాలెంట్ స్కూల్‌లో..